నమస్తే తెలంగాణ

సిద్దిపేట

I | హైదరాబాద్, ఆదివారం 5 జనవరి 2025 | SIDDIPET

వణికిస్తున్న చలి

● రాష్ట్రంలోనే కోహీర్‌లో 6.0 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు

హద్నూర్‌లో చలిమంట కాచుకుంటున్న గ్రామస్తులు

జహీరాబాద్, జనవరి 4 : సంగారెడ్డి జిల్లాలో చలితీవ్రత పెరిగింది. శనివారం రాష్ట్రంలోనే జహీరాబాద్ నియోజకవర్గంలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోనే అత్యల్ప కనిష్ట ఉష్ణోగ్రత కోహీర్‌లో 6.0 డిగ్రీలుగా నమోదైంది. న్యాల్‌కల్‌లో 6.3 డిగ్రీలు, జహీరాబాద్ మండలం మల్చాల్మాలో 7.3, అల్గోల్‌లో 7.9, సత్వార్‌లో 8.1, మొగుడంపల్లిలో 8.3, ఝరాసంగంలో 8.7, జహీరాబాద్ 9.1, కోహీర్ దిబ్బలో 9.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 8 గంటల వరకు పొగమంచు దట్టంగా కమ్ముకుంటున్నది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది. ఉదయం పనులకు వెళ్లే ఉద్యోగులు, కూలీలు, రైతులు, చిరువ్యాపారులు, మున్సిపల్, పంచాయతీ పారిశుధ్య సిబ్బంది చలికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చలి తీవ్రత పెరిగిన దృష్ట్యా ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఇద్దరు విద్యార్థులు.. ఒక టీచర్

గౌడ్‌గాం జనవాడ పాఠశాలలో రెండేండ్లుగా ఇదే పరిస్థితి

ఇద్దరు విద్యార్థినులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

నాగల్‌గిద్ద, జనవరి 4: సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలం గౌడ్‌గాం జన్వాడ గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఐదుగురు విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో శనివారం ఇద్దరు విద్యార్థులు మాత్రమే పాఠశాలకు హాజరయ్యారు. వీరికి జయమణి అనే ఉపాధ్యాయురాలు పాఠాలు బోధించారు. ఇక్కడ హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న అప్పారావు డిప్యుటేషన్‌పై కారాముంగి జిల్లా పరిషత్ పాఠశాలకు వెళ్లినట్లు తెలిసింది. ప్రస్తుతం గౌడ్‌గాం జన్వాడ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు కూడా పాఠశాలకు సరిగ్గా హాజరు కావడం లేదని తెలిసింది. ఇద్దరు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి పెట్టడం లేదు. దీంతో ఇంటి నుంచి టిఫిన్ తెచ్చుకుంటున్నారు. మండలంలోని చాలా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పడుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజనం అమలుతో పాటు విద్యార్థుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

డొంక కదులుతోంది..

- సర్వేనెంబర్ 329లో అధికారుల విచారణ
- దాదాపు 75 ప్లాట్లలో నిర్మాణాలు
- అర్హుల చేతిలో 19 ప్లాట్లు మాత్రమే
- 'నమస్తే తెలంగాణ' కథనాలతో అధికారుల విచారణ
- నిర్మాణాలను అడ్డుకున్న రెవెన్యూ యంత్రాంగం
- ఆరుగురు మేస్త్రీలను బైండోవర్ చేసిన తహసీల్దార్
- తహసీల్దార్ చేతిలో 2008 నాటి లబ్ధిదారుల జాబితా
- అధికశాతం నాయకుల బినామీలే

విచారణ చేపడుతున్న ఆర్‌ఐ ఖాజా

పటాన్‌చెరు, జనవరి 4: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామంలోని సర్వే నెంబర్ 329 ఖాళీ జాగాల కబ్జాపై 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో వారం రోజులుగా వచ్చిన వరుస కథనాలు అక్షర సత్యాలుగా అధికారులు గుర్తించారు. నమస్తే తెలంగాణ కథనాలపై విచారణ చేసిన అధికారులకు అక్కడ దాదాపు 75 ప్లాట్లలో నిర్మాణాలు జరుగుతున్నాయని గుర్తించారు. వాటిలో కేవలం 19మందికి మాత్రమే 2008 నాటి పట్టాలు ఉన్నాయని గుర్తించారు. నాయకులు, వారి అనుచరులు 56 ప్లాట్లు కబ్జా చేసి ఇండ్ల నిర్మాణం చేస్తున్నారని గుర్తించారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు సమర్పించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. వరుస సెలవులను అనువుగా మార్చుకుని చిట్కుల్‌లో లబ్ధిదారులం అంటూ 2008 నాటి పట్టాలతో భారీ సంఖ్యలో సర్వేనంబర్ 329లో కబ్జాలకు దిగి ఇండ్లు నిర్మాణ పనులు ప్రారంభించారు. వందలాది మంది ప్లాట్లకు పహారా ఉంటూ నాయకుల డైరెక్షన్‌లో కబ్జా పర్వం ప్రారంభించారు. ఆకస్మికంగా పెద్ద ఎత్తున్న నిర్మాణాలు జరుగుతుండటంతో 'నమస్తే తెలంగాణ' డిసెంబర్ 29న 'ప్రభుత్వ భూమికి ఎసరు' అనే కథనం, డిసెంబర్ 30న 'ఇప్పటికైతే అర్ధాంగీకారం...రేపు ప్రశ్నార్థకం?'..అనే మరో కథనం, డిసెంబర్ 31న 'వామ్మో.. సర్వే నెంబర్ 329' అనే వరుస కథనాలు ప్రచురించింది. ఈ కథనాలతో పటాన్‌చెరు తహసీల్దార్ రంగారావు, ఎంపీవో హరిశంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో వచ్చిన అధికార బృందం అక్రమ నిర్మాణాలను నిలిపివేశారు. కబ్జాదారులు అధికారులను గెర్వావ్ చేసి పాత పట్టాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీకి చెందిన నాయకుల ప్రోద్బలంతో వారి అనుచరులు అధికారులపై చెలరేగిపోయారు. తహసీల్దార్ పనులు నిలిపివేయాలని చెబుతూ యాక్షన్‌కు దిగారు. కలెక్టర్‌కు విచారణ చేసి రిపోర్టు ఇస్తామని, పై అధికారుల ఆదేశాలు వచ్చేవరకు నిర్మాణాలు పూర్తిగా నిలిపివేస్తున్నామని గట్టిగా హెచ్చరిస్తూ సిబ్బందిని నిఘాకు నియమించారు. అయినా కొందరు కబ్జాదారులు పనులు చేస్తుండడంతో, ఆ పనులు చేస్తున్న ఆరుగురు మేస్త్రీలను తహసీల్దార్ ఎదుట రెవెన్యూ సిబ్బంది, పోలీసులు బైండోవర్ చేశారు. ఆరుగురిని తహసీల్దార్ బైండోవర్ చేస్తూ సర్వే నెంబర్ 329లో నిర్మాణాలు చేస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నాయకుల బినామీలే ఎక్కువ...

పటాన్‌చెరు తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆర్‌ఐ ఖాజా శనివారం సిబ్బందితో కలిసి ప్లాట్లు కబ్జా చేస్తున్నవారి వద్ద ఉన్న పట్టాలను, ఇతర డాక్యుమెంట్లను పరిశీలించారు. దాదాపు 75మంది ప్లాట్లను, ఖాళీ జాగాను కబ్జా చేసి నిర్మాణాలు చేస్తున్నారని గుర్తించారు. వీరిలో కేవలం 19మంది వద్ద మాత్రమే 2008నాటి పట్టాలున్నాయి. మిగిలిన వారు నాయకుల ప్రోత్సాహంతోనే కబ్జాకు దిగినట్టుగా తేల్చారు. అధికారుల రిపోర్టు తహసీల్దార్ వద్దకు చేరింది. ఈ రిపోర్టు ఆధారంగా సర్వేనెంబర్ 329 పాత లేఔట్ పక్కనున్న మరో ఎకరన్నర భూమిని కొత్తగా కబ్జా చేసినట్టు గుర్తించారు. తహసీల్దార్ అక్కడ పనులు జరగకుండా కఠినంగా వ్యవహరిస్తున్నారు. 2008లో ప్రభుత్వం పంపిణీ చేసిన పేదల ఇండ్ల పట్టాల కీ రిజిస్టర్ తహసీల్దార్ తెప్పించుకుని పరిశీలిస్తున్నారు. కొందరు ప్రజలు నాటి లబ్ధిదారుల వద్ద పాత పట్టాలను కొని ఇండ్లను నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నారని తేలింది. కొత్తగా కబ్జా చేస్తున్న వాటిలో అధికశాతం మాజీ ప్రజాప్రతినిధుల అనుచరులు, కార్యకర్తలు, బంధువులు ఉన్నట్టు సమాచారం. లేఔట్ పక్కన కొత్తగా కబ్జా చేస్తున్న స్థలంలోనూ 28మంది పునాదులు చేస్తున్నట్టుగా చూసి నివ్వెర పోయారు. పనులకు వాడుతున్న జేసీబీలను సీజ్ చేస్తామని యజమానులను హెచ్చరించి పంపించారు. ఇప్పటికైతే అక్కడ ఎలాంటి పనులు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

19మంది మాత్రమే అర్హులుగా తేలారు: సంగారెడ్డి ఆర్డీవో రవీందర్‌రెడ్డి

పటాన్‌చెరు మండలం చిట్కుల్‌లో సర్వే నెంబర్ 329లో పాత పట్టాలు ఉన్నాయని కడుతున్న నిర్మాణాలపై అధికారులు విచారణ చేశారు. వాటిలో కేవలం 19 మంది మాత్రమే అర్హులు ఉన్నారని గుర్తించాం. దాదాపు 60 వరకు నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిసింది. త్వరలో వీటిపై విచారణ చేసి అర్హులకు న్యాయం చేస్తాం. తప్పుడు పత్రాలతో, అక్రమ దారుల్లో ఖాళీ జాగాలను కబ్జా చేసేందుకు ప్రయత్నించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. సర్వే నెంబర్ 329 భూమిని కాపాడుతాం.

ప్రజల కష్టసుఖాల్లో తోడుంటా

- హామీల అమలుకు బీఆర్ఎస్ పోరాటం
- చేర్యాల దవాఖాన భవనం త్వరలో పూర్తి
- పైసా ఖర్చు లేకుండా వైద్యం అందిస్తున్నా
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాలలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజరేశ్వర్‌రెడ్డి

చేర్యాల, జనవరి 4 : కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా చేర్యాలలోని రేణుకా గార్డెన్స్‌లో శనివారం చేర్యాల టౌన్, చేర్యాల, కొమురవెల్లి మండలాలకు చెందిన బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు తాను అన్ని విధాలుగా అండగా ఉంటానని, వారు పిలిస్తే కష్టసుఖాల్లో పాలు పంచుకుంటానని భరోసా ఇచ్చారు. గ్రామా ల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చా రు. సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంజూరు చేయించేందుకు జనగామ కార్యాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశానని, దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లో బాధితులకు చెక్కులు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.నియోజకవర్గ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం మూడు అంచల విధానాన్ని తాను అనుసరిస్తున్నానని, మొదటగా సంబంధిత సర్కారు దవాఖానల్లో వైద్యం అందించడం, అక్కడ వారికి నయం కాని పక్షంలో పెద్ద దవాఖానలకు పంపించి అక్కడ వైద్యం అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.అలాగే తనకు చెందిన నీలిమా దవాఖానలో నియోజకవర్గ ప్రజలు ఆధార్‌కార్డు తీసుకుని వస్తే ఉచితం వైద్య పరీక్షలు, వైద్యం, మందులు చేయిస్తున్నట్లు తెలిపారు.

అన్ని చెరువులు నింపుతాం...

చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లోని అన్ని చెరువులను నింపేందుకు ఇటీవల అధికారులతో తాను మాట్లాడినట్లు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం రూ.170 కోట్లను మంజూరు చేసి, కొంత భూమిని సేకరిస్తే నియోజకవర్గంలోని అన్ని గ్రామాల చెరువులకు కాల్వల నిర్మాణం పూర్తి అవుతుందని, దీంతో జనగామ, చేర్యాల ప్రాంతాలు సస్యశ్యామలం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విషయమై అసెంబ్లీలో సీఎం, సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తాను తీసుకుపోయినట్లు తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో మంజూరు చేసిన చేర్యాల ప్రభుత్వ దవాఖాన నూతన భవన నిర్మాణ పనులు చివరి దశకు చేరాయని, త్వరలో నూతన భవనాన్ని అందుబాటులోకి తెస్తామని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణిశ్రీధర్ రెడ్డి, కౌన్సిలర్లు మంగోలు చంటి, పచ్చిమడ్ల సతీశ్,మాజీ ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్, ఏఎంసీ మాజీ చైర్మన్ సుంకరి మల్లేశం,సీనియర్ నాయకులు ముస్త్యాల బాల్‌నర్సయ్య,బీఆర్ఎస్ టౌన్, మండల అధ్యక్షులు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, అనంతుల మల్లేశం,సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు పెడుతల ఎల్లారెడ్డి,యూత్ ఇన్‌చార్జీ శివగారి అంజయ్య, తాడెం రంజితాకృష్ణమూర్తి, పచ్చిమడ్ల మానస, మీస పార్వతి, అరిగె కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.



ధూళిమిట్టలో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న తహసీల్దార్ మధుసూదన్

తప్పులతడకగా చెక్కులు

-ఆందోళనలో లబ్ధిదారులు

మద్దూరు తహసీల్ కార్యాలయం ఎదుట చెక్కులు చూపిస్తున్న లబ్ధిదారులు

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 4: మద్దూరులో ప్రభుత్వం పంపిణీ చేసిన కల్యాణ లక్ష్మి చెక్కులు తప్పులతడకగా ఉండడంతో లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు. వల్లంపట్ల గ్రామానికి చెందిన దేవులపల్లి లక్ష్మి, సలాఖపూర్‌కు చెందిన కొమ్ము కిష్టమ్మలకు అందజేసిన చెక్కుల్లో తప్పులు దొర్లినట్లు బ్యాంక్ అధికారులు గుర్తించారు. లబ్ధిదారుల చెక్కులపై వేరే వారి అకౌంట్ నంబర్లు ఉండడంతో బ్యాంక్ అధికారులు వాటిని రిజక్ట్ చేశారు. దీంతో లబ్ధిదారులు మద్దూరు తహసీల్దార్ రహీంకు చెక్కులను తిరిగి అందజేశారు. అధికారులు తక్షణమే స్పందించి తప్పులుదొర్లిన కల్యాణ లక్ష్మి చెక్కులను సరి చేసి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు

● వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్

మంత్రి పొన్నం ప్రభాకర్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మెదక్ కలెక్టర్, అధికారులు

మెదక్, జనవరి 4(నమస్తే తెలంగాణ) : రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరికీ రోడ్డు భద్రతా ప్రమాణాలపై అవగాహన కల్పించేలా మాసోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర బీసీ, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి రోడ్డు భవనాల శాఖ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్‌తో కలిసి రోడ్డు భద్రతా మాసోత్సవాల నిర్వహణపై కలెక్టర్లు, ఎస్పీలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గతంలో కేంద్ర ప్రభుత్వం రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించేదని, దీని ప్రాధాన్యత దృష్టిలో ఉంచుకొని నేడు రోడ్డు భద్రతా మాసోత్సవం నిర్వహిస్తునట్లు తెలిపారు. రోడ్డు భద్రతా ప్రమాణాలపై ప్రతిచోట అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సంక్రాంతి సెలవుల తర్వాత విద్యార్థులతో భారీ ర్యాలీలు నిర్వహించాలన్నారు. ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్‌శాఖ, పోలీస్, విద్య, రోడ్డు భవనాల శాఖల అధికారులు సమన్వయంతో దీనిని విజయవంతం చేయాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలను ఉల్లంఘించే వారి లైసెన్స్‌లు రద్దుచేసి, భవిష్యత్తులో లైసెన్స్ జారీ చేయకుండా చర్యలు చేపట్టాలన్నారు. హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు భవనాల శాఖ స్పెషల్ సీఎస్ వికాస్‌రాజ్ మాట్లాడుతూ.. డ్రైవర్ల తప్పిదంతో 75శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, తెలిపారు. వీసీ అనంతరం మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ..మెదక్ జిల్లాలో 33 బ్లాక్ స్పాట్ గుర్తించామని, ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఎస్పీ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ.. డ్రంక్ అండ్ డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించడం మూలంగా అధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. సమీక్షలో ఆర్‌అండ్‌బీ ఈఈ సర్దార్‌సింగ్, డీఈవో రాధాకృష్ణ, ఆర్టీసీ డీఎం సురేఖ, మెదక్, రామాయంపేట, నర్సాపూర్, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

● సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి ● హుస్నాబాద్‌లో అధికారులతో సమీక్ష

హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో అభివృద్ధి పనులపై అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్

హుస్నాబాద్, జనవరి 4: హుస్నాబాద్ నియోజకవర్గంలోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అధికారులను ఆదేశించారు. శనివారం హుస్నాబాద్ ఐవోసీ భవనంలోని సమావేశ మందిరంలో మూడు మండలాల్లోని అభివృద్ధి పనుల పురోగతిపై వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్‌అండ్‌బీ, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, నేషనల్ హైవే, మున్సిపల్, ఈడబ్ల్యూడీసీ తదితర శాఖల ద్వారా చేపట్టిన రహదారులు, భవనాలు, డ్రైనేజీ, సీసీ రోడ్లు, మరుగుదొడ్లు, అదనపు తరగతి గదుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించాలని సూచించారు. ఎల్కతుర్తి నుంచి సిద్దిపేట వరకు జరుగుతున్న హైవే పనులకు సంబంధించిన భూసేకరణ సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈజీఎస్ కూలీల పనిదినాల లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకం అమలులో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో రామ్మూర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, వివిధ శాఖల డివిజన్, మండల స్థాయి ఇంజనీర్లు, అధికారులు పాల్గొన్నారు.

హుస్నాబాద్ పట్టణంలో పలు అభివృద్ధి పనుల పరిశీలన...

హుస్నాబాద్ పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ మనుచౌదరి పరిశీలించారు. పట్టణంలోని గాంధీచౌక్, కరీంనగర్ రోడ్డు వైజంక్షన్, నాగారం రోడ్డు, అంబేద్కర్ చౌరస్తాల్లో జరుగబోయే అభివృద్ధి పనులను పరిశీలించి వాటి పురోగతిపై స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులతో చర్చించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, ఆర్డీవో రామ్మూర్తి, కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్

మంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో....

జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల నిర్వహణలో భాగంగా మంత్రి పొన్నం ప్రభాకర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సిద్దిపేట జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. హుస్నాబాద్ ఆర్డీవో కార్యాలయంలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని మాసోత్సవాలపై మంత్రి సూచనలు, ఉత్సవాల నిర్వహణపై విధి విధానాలను నోట్ చేసుకున్నారు. నెల రోజుల పాటు జరిగే మాసోత్సవాల్లో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాలని మంత్రి సూచించారు.

రైతు వ్యతిరేక విధానాలు వీడాలి

సిద్దిపేట ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రైతురక్షణ సమితి నాయకులు

- చట్టబద్ధతతో కూడిన మద్దతు ధరను కేంద్రం ప్రకటించాలి
- సిద్దిపేట ఆర్డీవో కార్యాలయం ఎదుట రైతు రక్షణ సమితి నాయకుల నిరసన

సిద్దిపేట ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న రైతురక్షణ సమితి నాయకులు

సిద్దిపేట,జనవరి 4: రైతు సమస్యల పరిష్కారం, డిమాండ్లు నెరవేర్చడంలో కేంద్రం ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నదని, బీజేపీ సర్కారు రైతు వ్యతిరేఖ విధానాలకు వీడాలని తెలంగాణ రైతు రక్షణ సమితి సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు మారెడ్డి రామలింగారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం రైతు రక్షణ సమితి ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవోకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు చేస్తున్న ధర్నాకు కేంద్రం స్పందించక పోవడం దారుణమన్నారు. ప్రముఖ రైతు నాయకుడు జగ్‌జిత్ సింగ్ దల్లే 70ఏండ్ల వయస్సులో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపైన నిరసన చేపట్టినట్లు తెలిపారు. రైతులు పండించిన పంటలకు న్యాయమైన ఎమ్మెస్పీ నిర్ణయించాలని, ప్రకటించిన ఎంఎస్పీకి చట్టబద్ధత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. జగ్‌జిత్ సింగ్ చేపట్టిన నిరాహార దీక్ష 41వ రోజుకు చేరిందన్నారు. ఆయన ఆరోగ్యం క్షీణిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించక పోవడాన్ని తెలంగాణ రైతుల పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సైతం రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నదని విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టిసారించాలని రైతు నాయకులు కోరారు.కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మయ్య, యాదం రావు, దేవేందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మధుసూదన్, మోహన్ రెడ్డి, పి వెంకట్ రెడ్డి, భూపతిరెడ్డి, సంతోష్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించి పేరుతెచ్చుకోవాలి

● మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేశ్

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేశ్

శిక్షణకు హాజరైన జూనియర్ అసిస్టెంట్లు

మెదక్, జనవరి 4 (నమస్తే తెలంగాణ) : ఉద్యోగం పెద్దదా చిన్నదా అనేది కాదని, బాధ్యతగా విధులు నిర్వర్తించి మంచి ఉద్యోగిగా పేరు సంపాదించుకోవాలని మెదక్ అదనపు కలెక్టర్ నగేశ్ జూనియర్ అసిస్టెంట్లకు పిలుపునిచ్చారు. గ్రూప్ -4 ద్వారా మెదక్ జిల్లాలో 44 మంది యువత జూనియర్ అసిస్టెంట్లుగా ఎంపికయ్యారు. శనివారం సమీకృత కలెక్టరేట్ ఆడిటోరియంలో వారికి విధి నిర్వహణపై వర్క్‌షాప్ ఏర్పాటు చేశారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి అదనపు కలెక్టర్ నగేశ్ మాట్లాడుతూ.. రెవెన్యూ శాఖలో ఉద్యోగం సాధించడం చాలా గొప్ప విషయమని, తొందరలో వీరందరికీ ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తామని తెలిపారు. కలెక్టరేట్‌తో పాటు అన్ని మండలాల రెవెన్యూ కార్యాలయాలకు జూనియర్ అసిస్టెంట్లను కేటాయిస్తామని చెప్పారు. రెవెన్యూ శాఖలో ఉద్యోగం సంపాదించడం ద్వారా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలులో కీలక పాత్ర పోషించే అవకాశం లభిస్తుందని తెలిపారు. అంతకుముందు వికారాబాద్ రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ సురేశ్ పోత్‌ధార్ రెవెన్యూ చట్టాలు, ఆర్టీఐ యాక్ట్, సర్వీస్ మేటర్స్, బాధ్యతగా కొలువుల నిర్వహణ సంబంధిత అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి భుజంగరావు, కలెక్టరేట్ ఏవో యూనస్, తహసీల్దార్ శ్రీనివాస చారి, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

కల్యాణం..కమనీయం

● అంగరంగా వైభవంగా సిద్ధివినాయకుడి కల్యాణం
● భారీగా తరలివచ్చిన భక్తులు

స్వామివారి కల్యాణానికి ఉత్సవ విగ్రహాలను తీసుకుని వస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కల్యాణానికి తరలివచ్చిన భక్తులు

జహీరాబాద్, జనవరి 4: సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం రేజింతల్ గ్రామ శివారులో స్వయంభూగా వెలిసిన సిద్ధివినాయకుడి కల్యాణోత్సవం శనివారం కమనీయంగా జరిగింది. స్వామివారి 225వ జయంతోత్సవాల ముగింపును పురస్కరించుకుని కంచి కామకోటి పీఠం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో స్వామి వారికి వేదపండితులు అభిషేకం, మహామంగళ హారతి తదితర పూజలు నిర్వహించారు. ఆనంతరం ఆలయ ప్రాంగణంలో పచ్చని పందిళ్లల్లో వివిధ రకాల పుష్పాలతో వేదికను ఏర్పాటు చేశారు. మంగళ వాయిద్యాల మధ్య ఆలయ గర్భగుడి నుంచి వేదిక వరకు ఆలయ కమిటీ సభ్యులు వినాయకుడితో పాటు సిద్ధి, బుద్ధి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఆనంతరం ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా బుద్ధి, సిద్ధిలతో సిద్ధివినాయక స్వామికి కల్యాణాన్ని కనుల పండువుగా జరిపించారు. కల్యాణం అనంతరం మహిళలు అమ్మవార్లకు ఒడిబియ్యాన్ని పోసి, కట్న కానుకలు సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఎస్పీ చెన్నూరి రూపేశ్ దంపతులతో పాటు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఉత్సవాల్లో ఆలయ గౌరవ అధ్యక్షుడు అల్లాడి వీరేశం, ఆలయ కమిటీ అధ్యక్షుడు రేజింతల్ అశోక్, ప్రధాన కార్యదర్శి అల్లాడి నర్సింహులు, రేజింతల్, ప్రధాన కార్యదర్శి అల్లాడి నర్సింహులు, ఉపాధ్యక్షుడు నీల రాజేశ్వర్, ఉల్లిగడ్డ బస్వరాజ్, సంయుక్త కార్యదర్శులుగా చిద్రి లక్ష్మణ్, కల్లచంద్రశేఖర్, కోశాధికారిగా డిగంబర్ పోలా, కార్యనిర్వహకులు కొబ్బజీ రవికుమార్, సభ్యులు సంగమేశ్వర్, దీపక్‌జోషి, చంద్రశేఖర్, మేనేజర్ కృష్ణ,అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.